

నిరీక్షణకు తెర!

- ఎట్టకేలకు కార్పొరేషన్ చైర్మన్ల నియామకం
- చైర్మన్లుగా బాధ్యతలు స్వీకరించిన జిల్లాకు చెందిన ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డి
- రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్న మానాల మోహన్‌రెడ్డి
- జిల్లా స్థాయిలో నామినేటెడ్ పోస్టుల కోసం ఆశావహుల ప్రయత్నాలు


రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా హైదరాబాద్‌లో బాధ్యతలు స్వీకరిస్తున్న ఈరవత్రి అనిల్


రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టుల నిరీక్షణకు తెరపడింది. ప్రభుత్వం మూడున్నర నెలల తర్వాత జీవోను విడుదల చేయడంతో జిల్లాకు చెందిన ముగ్గురు నేతలు రాష్ట్రస్థాయిలో కార్పొరేషన్ చైర్మన్లుగా నియామకమయ్యారు. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, అన్వేష్‌రెడ్డిలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. వారు రెండేళ్ల పాటు చైర్మన్లుగా పనిచేయనున్నారు. ముగ్గురికి కీలకమైన చైర్మన్ పోస్టులు ఇవ్వడంతో రెండేళ్ల పాటు రైతులు, ప్రజలకు ఉపయోగపడే పనులను తమ కార్పొరేషన్ల ద్వారా చేపట్టనున్నారు. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం క్లియరెన్స్ ఇవ్వడంతో జిల్లా స్థాయి పోస్టులు కూడా త్వరలోనే భర్తీ కానుండటంతో నేతలు ప్రయత్నాలను మొదలు పెట్టారు. కీలకమైన పోస్టులను తెచ్చుకునేందుకు ప్రజాప్రతినిధుల ద్వారా ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

మూడున్నర నెలల తర్వాత ఉత్తర్వులు జారీ

రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు 35 మంది కార్పొరేషన్ చైర్మన్లకు సోమవారం ఉత్తర్వులను జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మార్చి15న రాష్ట్రంలోని కాంగ్రెస్ సీనియర్ నేతలకు కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశం కల్పించారు. అయితే పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో ప్రభుత్వం తరఫున ఉత్తర్వులను జారీ చేయలేదు. ఎన్నికలు ముగిసి మూడున్నర నెలల తర్వాత ఉత్తర్వులను జారీ చేశారు. ఈ ఉత్తర్వులకు అనుగుణంగా చైర్మన్లు బాధ్యతలను చేపట్టారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయిలో ముగ్గురు సీనియర్ నేతలకు కార్పొరేషన్ చైర్మన్లుగా అవకాశాన్ని ఇచ్చారు. దీంతో మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ఎస్.అన్వేష్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్‌గా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. అయితే వచ్చే గురువారం అధికారికంగా బాధ్యతలను చేపట్టనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరితో పాటు మొత్తంగా 35 మందిని నియమించారు. పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ కీలకమైన సమయంలో పనిచేసిన ఈ ముగ్గురు నేతలకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్లుగా పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు సీఎం రేవంత్ రెడ్డి నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులను జారీ చేయడంతో జిల్లాకు చెందిన ఇద్దరు చైర్మన్లుగా బాధ్యతలను చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎమ్మెల్యేగా, విప్‌గా పనిచేసిన ఈరవత్రి అనిల్ మూడు దఫాలు బాల్కొండ నుంచి పోటీ చేశారు. ఈ నియోజకవర్గం నుంచి 2009లో గెలిచిన ఆయన 2014, 2018లో ఓటమిపాలయ్యారు. గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు. అలాగే కిసాన్ కాంగ్రెస్‌లో కీలకంగా పనిచేసిన అన్వేష్‌రెడ్డికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియామకం చేశారు. రైతుల సమస్యలపైన ఆయన పదేళ్ల పాటు ఉద్యమాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలు పర్యటించారు. కాంగ్రెస్ నేతలతో కలిసి బస్సు యాత్రలు, పాదయాత్రల్లో పాల్గొన్నారు. రైతుల కోసం ఆయన చేసిన పని పార్టీలో కీలకంగా వ్యవహరించడంతో ఈ చైర్మన్ పదవిలో అవకాశం ఇచ్చారు. అలాగే కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్న మానాల మోహన్‌రెడ్డిని రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ చైర్మన్‌గా నియామకం చేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయడవంతో పాటు శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కీలకంగా పనిచేయడం, రైతు ఉద్యమాలతో పాటు పసుపు రైతులకు మద్దతుగా సమావేశాలు నిర్వహించడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆయనను కీలకపదవిలో నియమించారు.

ఏళ్లతరబడి పార్టీకి సేవలందించిన వారికి పదవులు

కాంగ్రెస్‌లో కీలకంగా పనిచేసిన వారికి పార్టీ అధిష్ఠానం పదవులను కట్టబెట్టింది. గత పదేళ్లలో పార్టీని విడిచిపెట్టకుండా ఉంటూ ఉద్యమంగా పనిచేసిన నేతలందరికీ పదవులను ఇవ్వనుంది. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చారు. భవిష్యత్తులో కీలకమైన పదవిని ఆయనకు కట్టబెట్టనున్నారు. ఏళ్లతరబడి కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ కీలకంగా పనిచేసిన తాహెర్‌బిన్ హందాన్‌కు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. ఆయన క్రియాశీలకంగా పనిచేయడంతో ఈ పదవిని కట్టబెట్టారు. వారిద్దరితో పాటు ప్రస్తుతం బాల్కొండ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు నేతలకు ఈ కీలకమైన మూడు కార్పొరేషన్ చైర్మన్ పదవులను ఇచ్చారు. వీరితో పాటు మరో ఇద్దరు లేదా ముగ్గురికి రాష్ట్రస్థాయితో పాటు జిల్లా స్థాయిలో కీలకమైన నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉద్యమం నుంచి ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎటూ వెళ్లకుండా కాంగ్రెస్‌లోనే ఉండే నేతలందరికీ అవకాశాన్ని బట్టి నామినేటెడ్ పదవుల్లో నియామకం చేయనున్నారు. జిల్లాస్థాయిలో మార్కెట్ కమిటీలు, గ్రంథాలయ సంస్థ, సుడాతో పాటు దేవాలయ కమిటీలు ఉన్నాయి. ఇవేకాకుండా ఇతర నామినేటెడ్ పోస్టులు ఉన్నాయి. మార్కెట్ కమిటీలో కీలకమైన నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూరల్ నియోజకవర్గం నుంచి అవకాశం ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పేర్లను పరిశీలించిన నేతలు ఒకరిని నియమించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో కీలకమైన సుడా కూడా సీనియర్ నేతకు అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. ఈ పోస్టులతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ కూడా కీలకంగా ఉండటం అన్ని సమావేశాల్లో పాల్గొనే అవకాశం ఉండటంతో దానికి కూడా సీనియర్ నేతను నియమించనున్నట్లు పార్టీ నేతల సమాచారం బట్టి తెలుస్తోంది. ఈ పోస్టులు భర్తీ అయిన తర్వాత వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీనియర్ నేతలకు రిజర్వేషన్లను బట్టి జడ్పీ చైర్మన్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా, మేయర్‌గా అవకాశం ఇవ్వనున్నారు.

ఆశావహుల ముందస్తు ప్రయత్నాలు

రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో మిగతా నేతలు కూడా ప్రయత్నాల్లో ఉన్నారు. రాష్ట్రస్థాయితో పాటు జిల్లా స్థాయిలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు. ఆ పోస్టుల్లో తమకు అవకాశం ఇవ్వాలని ఎమ్మెల్యేలతో పాటు సీనియర్ నేతలను కలుస్తున్నారు. కొంత మంది నేతలు హైదరాబాద్‌లో ఉండి తమకు దగ్గరగా ఉన్న మంత్రులను, ఇతర నేతలను కలుస్తున్నారు. నామినేటెడ్ పోస్టులను త్వరగా భర్తీ చేయాలని కోరడంతో పాటు పార్టీకి చేసిన సేవలను బట్టి అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం అన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉండటంతో ముందస్తుగా ఈ ప్రయత్నాలను చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా జిల్లా స్థాయిలోని నామినేటెడ్ పోస్టులలో కీలక నేతలకు అవకాశం ఇవ్వనున్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న సీడీటీఐ డైరెక్టర్ రాజశేఖర్, చిత్రంలో సీపీ, ఇతర అధికారులు

నూతన చట్టాల అమలుతో సత్వర న్యాయం

- సీడీటీఐ డైరెక్టర్ రాజశేఖర్

ఖిల్లా, జూలై 8: నూతన చట్టాల అమలుతో ప్రజలకు సత్వర న్యాయం జరుగుతుందని ఆ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని సీడీటీఐ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ ఆధ్వర్యంలో నూతన నేర, న్యాయచట్టాల అమలు తీరును సోమవారం పరిశీలించారు. నగరంలోని ఒకటో టౌన్ పోలీసుస్టేషన్, డిచ్‌పల్లి పోలీసు స్టేషన్‌లలో అమలు తీరును పరిశీలించారు. సిబ్బందితో, ఐటీకోర్ సిబ్బందితో, పోలీసుస్టేషన్ రైటర్‌లతో చర్చించారు. అనంతరం పోలీసు కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీపీ కల్మేశ్వర్ శింగనేవార్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచలను చేశారు. మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ బ్యూరో ఆఫ్ పోలీసు రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరోల కమిటీ ఆధ్వర్యంలో కమిషనరేట్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో చర్చించారు. ఇందులో జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల, జిల్లాకు చెందిన పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌లతో నేర, న్యాయచట్టాలపై చర్చించారు. ఈ సమీక్షలో మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ నుంచి వచ్చిన కుర్ర శ్రీనివాస్, రాజేశ్‌కుమార్‌ఝా, నూరెల్లి శ్రీనివాస్, ఏసీపీలు రాజవెంకటరెడ్డి, శ్రీనివాస్, బస్వారెడ్డి, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావ్, సీసీఆర్బీ ఏసీపీ రవీందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, జిల్లాలోని ఇన్స్‌పెక్టర్లు, ఎసైలు, తదితరులు పాల్గొన్నారు.


సమీక్షలో పాల్గొన్న పోలీసు అధికారులు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

'ఇంటింటా ఇన్నోవేటర్' పోస్టర్ల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, జూలై 8: తెలంగాణ రాష్ట్ర ఆవిష్కరణ కేంద్రం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇంటింటా ఇన్నో వేటర్ 2024 కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆవిష్కరించారు. ప్రతి ఏడాది తరహాలోనే ఈ ఏడాది కూడా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి ఆవిష్కర్తలు దరఖాస్తులు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతానికి చెందిన ఆవిష్కర్తలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. సరికొత్త ఆవిష్కరణలకు అనువైన వాతావరణం కల్పిస్తూ వారిని ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఆవిష్కరణల కోసం దరఖాస్తులు స్వీకరిస్తుందని అన్ని వర్గాలకు చెందిన ఆవిష్కర్తలు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారు వారి వినూత్నమైన ఆలోచనలు, ప్రాజెక్టులను సమర్పించవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈ యేడాది మరింత విస్తృత స్థాయిలో చేపట్టనున్నామని ఆగస్టు 15న గొప్ప ఆవిష్కరణలకు అవార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆవిష్కర్తలు వారి దరఖాస్తులను నేరుగా వాట్సాప్ ద్వారా 9100678543 నెంబర్‌కు పంపించాలని దరఖాస్తులో పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, గ్రామం, మండలం, ఆవిష్కరణ పేరు, 100 పదాలకు మించకుండా ఆవిష్కరణకు సమర్పించిన వివరణ పత్రం పొందుపర్చాలని, 4 ఫోటోలు హై రిజల్యూషన్ కలిగినవి, ఆవిష్కరణ పని తీరు ప్రదర్శించే రెండు వీడియోలను ఆగస్టు 3వ తేదీలోగా పంపాలన్నారు. అదనపు సమాచారం కోసం 9441191829 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమీషనర్ మకరంద్, తదితరులు పాల్గొన్నారు.




జిల్లాలో మోస్తరు వర్షాలు

- జిల్లాలో ఇప్పటి వరకు కురిసిన 193.7 మి.మీ వర్షం
- ఎస్సారెస్పీలోకి 3414 క్యూసెక్కుల వరద

నిజామాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో ఈ వర్షం నమోదైంది. జిల్లాలోని కొన్ని మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడగా మరికొన్ని మండలాల్లో జల్లులతో కూడిన వర్షం పడింది. నిజామాబాద్‌లోని నార్త్ మండలంలో 46.8 మిల్లీమీటర్ల వర్షం పడగా ఆర్మూర్ మండలంలో అతితక్కువగా 2.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 215.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా ఇప్పటి వరకు 193.7 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలోని ఏడు మండలాల్లో సాధారణ సగటు వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం పడింది. జిల్లాలోని 16 మండలాల్లో సాధారణ సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని పలు మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షం పడింది. నైరుతి రుతుపవనాల ప్రభావం మరో రెండు రోజుల పాటు ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ ప్రభావంతో జిల్లాలో ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వారు తెలిపారు.

ఎస్సారెస్పికి స్వల్పంగా పెరిగిన వరద..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు స్వల్పంగా వరద పెరిగింది. ప్రాజెక్టు పరీవాహక ప్రాంతంలో వర్షాలు పడుతుండటంతో ఈ వరద కొద్ది కొద్దిగా పెరుగుతోంది. ప్రాజెక్టులోకి 3414 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుంది. వానాకాలం ఆరంభమైనప్పటి నుంచి ప్రాజెక్టులోకి భారీ వరదలు రాలేదు. శివారు ప్రాంతం, ఎగువ ప్రాంతంలో పడుతున్న కొద్దిపాటి వర్షాలతో ఈ వరద వచ్చి చేరుతుంది. మహారాష్ట్రలోని బాబ్లీ గేట్లను తెరిచినా నాందేడ్, ఔరంగాబాద్ జిల్లాల పరిధిలో భారీ వర్షాలు పడకపోవడం వల్ల గోదావరికి పూర్తిస్థాయిలో వరదలు రావడం లేదు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1061.50 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసిలకు గాను ప్రస్తుతం 11.965 టీఎంసిల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో జూన్ ఆరంభం నుంచి ఇప్పటి వరకు 5.975 టీఎంసిల నీళ్లు వచ్చి చేరాయి. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా పడకపోవడం వల్ల వరద ఇంకా పెరగలేదని ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు.





డాక్యుమెంట్ రైటర్లు వర్సెస్ రియల్ ఎస్టేట్ ఏజెంట్లు

● డాక్యుమెంటేషన్ చార్జీలు తగ్గించాలంటున్న రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ● తగిన ఆదాయం లభించడం లేదంటున్న డాక్యుమెంట్ రైటర్లు ● ధర్నాకు సిద్ధమవుతున్న రియల్ ఎస్టేట్ ఏజెంట్లు

బోధన్‌రూరల్, జూలై 8: బోధన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పనులు చేసుకుంటున్న డాక్యుమెంట్ రైటర్లకు, బోధన్ రియల్ ఎస్టేట్ ఏజెంట్లకు మధ్య వివాదం రాచుకుంది. రోజురోజుకూ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకునేలా వివాదం తారాస్థాయికి చేరుకుంది. డాక్యుమెంట్ రైటర్ల తీరును నిరసిస్తూ రియల్ ఎస్టేట్ ఏజెంట్లు ధర్నాకు సిద్ధమవుతున్నారు. డాక్యుమెంట్ రైటర్లు బోధన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద తమ పనులు నిర్వహిస్తున్నారు. ఇళ్ల స్థలాలు, ప్లాట్లు, భవనాలు కొనుగోలు, విక్రయాల సందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్‌కు విక్రయదారులకు మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తారు. కొనుగోలు, విక్రయాలు జరిగిన సందర్భాల్లో మధ్యవర్తులుగా వ్యవహరించే రియల్ ఎస్టేట్ ఏజెంట్లు వాటిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు వీలుగా డాక్యుమెంట్ రైటర్లకు అప్పగిస్తారు. వీరు ఒప్పంద పత్రాలను ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో రాసి సబ్ రిజిస్ట్రార్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తారు. అయితే డాక్యుమెంట్ రైటర్లు చార్జీలు ఒక్కసారిగా పెంచడంతో రియల్ ఎస్టేట్ ఏజెంట్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఒక్కో డాక్యుమెంట్‌కు 2500రూపాయలు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో 1800 రూపాయలు వసూలు చేసేవారని ప్రస్తుతం 2500రూపాయలకు పెంచడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైటర్ల వల్ల కొనుగోలుదారులపై భారం పడుతుందని పలువురు ఏజెంట్‌లు ఆందోళన చెందుతున్నారు. పెంచిన చార్జీలు తగ్గించాలని రియల్ ఎస్టేట్ ఏజెంట్లు సబ్ రిజిస్ట్రార్, పోలీసులను కలిసి సమస్యను వివరించారు. డాక్యుమెంట్ రైటర్లు తీరు మార్చుకోకపోతే ధర్నా చేస్తామని రియల్ ఎస్టేట్ ఏజెంట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం ధర్నాకు అనుమతి ఇవ్వాలని పోలీసులను కలిసినట్లు సమాచారం.


బోధన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్యుమెంట్ రైటర్లు

డాక్యుమెంటేషన్ చార్జీలు తగ్గించాలి..

పెంచిన డాక్యుమెంటేషన్ చార్జీలు తగ్గించాలని కోరుతూ బోధన్ రియల్ ఎస్టేట్ ఏజెంట్ల సంఘం ఆధ్వర్యంలో బోధన్ సబ్ రిజిస్ట్రార్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. బోధన్ రియల్ ఎస్టేట్ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి అబ్దుల్ మొహిజ్ మాట్లాడుతూ.. గత నెల1వ తేదీ నుంచి డాక్యుమెంటేషన్ చార్జీలను విపరీతంగా పెంచారని, గతంలో 1800 రూపాయలు తీసుకునే వారని ప్రస్తుతం 2500రూపాయలు తీసుకుంటున్నారని వెల్లడించారు. చార్జీలు తగ్గించే వరకు తాము కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. సోమవారం ఏసీపీ, ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు.

డాక్యుమెంట్ రైటర్లపై ఆరోపణలు మానుకోవాలి

బోధన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని రియల్ ఎస్టేట్ ఏజెంట్లు డాక్యుమెంట్ రైటర్లపై చేస్తున్న తప్పుడు ఆరోపణలు మానుకోవాలని విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అనంతరం బోధన్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్ల మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా ఈ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్లకు తాము సహాయ, సహకారాలు అందిస్తున్నా తమపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. డాక్యుమెంట్ రైటర్లపై పోలీసులకు ఫిర్యాదు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం గృహల పాట్లు, విక్రయాలు మాత్రమే జరుగుతున్నాయని అందువల్ల తమకు తగిన ఆదాయం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో రియల్ ఎస్టేట్ ఏజెంట్లు తమకు డాక్యుమెంట్‌కు వంద రూపాయలు ఇవ్వాలని పట్టుబట్టడం సరికాదన్నారు. రియల్ ఎస్టేట్ ఏజెంట్లు బ్లాక్‌మెయిల్ చేసే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కొన్ని నెలలుగా రియల్ ఎస్టేట్ ఏజెంట్లు అసోసియేషన్‌గా ఏర్పాటు చేసుకుని తమ కార్యాలయాలకు వచ్చి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. దస్తావేజులు రాయకుండా తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు హరికాంత్ చారి, అబ్దుల్ హమీద్, నాగేశ్వర్ రావు, మక్సుద్, మురళీ, అఖిల్, పూర్ణ, నీలకంఠం, సదీప్, ప్రవీణ్ పాల్గొన్నారు.


ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేస్తున్న రియల్ ఎస్టేట్ ఏజెంట్లు

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ కన్వీనర్ సేవలు మరువలేనివి



బోధన్‌రూరల్, జూలై 8: నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ కన్వీనర్ రాఘవులు 5వ వర్థంతి సభను బోధన్ పట్టణంలోని పీఆర్‌టీయూ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నిజాంషుగర్స్‌ఫ్యాక్టరీ ప్రభుత్వపరం కావాలని పరిరక్షణ కమిటీ పేరుతో అంబేద్కర్ చౌరస్తాలో అనేక రోజుల పాటు రిలే దీక్షలు నిర్వహించారన్నారు. కార్మికుల కోసం ఆయన చేసి కృషి కొనియాడారు.ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు మల్లేష్, సుధాకర్, గంగాధరప్ప, ఏశాల గంగాధర్, శంకర్ గౌడ్, వరదయ్య, గంగులు, బలరామరాజు, జేఏసీ గోపాల్ రెడ్డి, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు సర్టిఫికెట్ల పంపిణీ

ఆర్మూర్‌రూరల్, జూలై 8: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో హిందీ విద్వాన్, భూషణ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినులకు సోమవారం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దేవరాం సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. ఉత్తీర్ణులైన విద్యార్థినులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ గంగాధర్, డిజె.శాంతి, అధ్యాపకులు వెంకటేష్, మహేందర్, వనిత, స్వాతి, రజకళ, గంగారాం, ఇర్ఫాన్, మురళీకృష్ణ, నరేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.






సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి, జూలై 8: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చక సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో విద్య, వైద్యంకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. సోమవారం జక్రాన్‌పల్లిలో మండలంలోని 21గ్రామాలకు చెందిన 140మంది లబ్ధిదారులకు రూ.కోటి 40లక్షల కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను ఎమ్మెల్యే భూపతిరెడ్డి పంపిణీ చేశారు. అంతకు ముందు జక్రాన్‌పల్లిలో ఆదర్శ పాఠశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే మొక్కలు నాటి నీళ్ల పోశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత ప్రముఖ పారిశ్రామికవేత్త పైషల రాజారెడ్డి కంప్యూటర్‌లను కొనుగోలు చేసి ఇవ్వగా ఎమ్మెల్యే కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ భూపతరెడ్డి మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలలో కిచెన్‌షెడ్, డైనింగ్‌హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద రాష్ట్రంలో 26వేల పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేసేందుకు రూ.2వేల కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ నిధులతో పాఠశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో మహిళలకు రూ.లక్ష కోట్ల రుణం ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, యువజన విభాగం అధ్యక్షుడు వినోద్, సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, నాగుల శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, జక్రాన్‌పల్లి గ్రామ ప్రత్యేక అధికారి బ్రహ్మానందం, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త పైషల రాజారెడ్డి, మాజీఎంపీపీ అప్పాల పెద్ద రాజన్న, కే.అనంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయ కులు మునిపల్లి చిన్నసాయిరెడ్డి, కాట్‌పల్లి నర్సారెడ్డి, రూపాల గంగారెడ్డి, బాలకిషన్, మామిడి బాస్కర్, మద్దుల రమేష్, బోర్‌వేల్ రాజు, శ్రీని వాస్‌గౌడ్, జితేందర్‌నాయక్, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన వంటశాలలో శుభ్రత పాటించాలి

● చౌట్‌పల్లి వైద్య అధికారి సుప్రియ

కమ్మర్‌పల్లి, జూలై 8: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సౌకర్యార్థం అమలు పరుస్తున్న మధ్యాహ్న భోజన వంటశాలలవద్ద పరిశుభ్రతను పాటిస్తు విద్యార్థులకు రుచికరమైన, ఆరోగ్యకరమైన భోజనాలు అందించాలని చౌట్‌పల్లి ప్రభుత్వ అసుపత్రి వైద్యాధికారి సుప్రియ అన్నారు. సోమవారం మండలంలోని చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన వంటలను, పరిసరాలను మండల విద్యాధికారితో కలిసి ఆమె పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశాలు ఉంటాయని వంటశాలలు, పరిసరాల్లో ఈగలు ముసరకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. విద్యార్థులకు శుభ్రమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. ఈ సందర్భంగా వంటలను ఆమె పరిశీలించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. డాక్టర్ సుప్రియ వెంట హెచ్‌ఈవో సత్యనారాయణ, ఆసుపత్రి వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఎంపీడీవో

రెంజల్, జూలై 8: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజనేయులు, ఉపాధ్యాయులు కిషోర్, కృష్ణమూర్తి తదితరులున్నారు.

కట్టడాలను పరిశీలించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం

ఆర్మూర్‌టౌన్, జూలై 8: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్‌తో పాటు పట్టణంలో జరుగుతున్న కట్టడాలను సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అధికారులు పరిశీలించారు. ఇళ్ల, వ్యాపార నిర్మాణాలు చేపట్టేవారు అనుమతులు తీసుకొని అనుమతి ప్రకారం కట్టడాలను చేపట్టాలని వారు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి హరిష్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ అశోక్, ఎస్సై గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

టెన్త్, ఇంటర్ టాపర్లకు బహుమతుల ప్రదానం

ఆర్మూర్‌టౌన్ జూలై 8: పట్టణంలోని జమాతే ఇస్లామిక్ హింద్ ఆధ్వర్యంలో సోమవారం మైనారిటీ విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఇటీవల టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతుతో పాటు మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామిక్ హింద్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ.బేగ్‌జహెద్, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్ నజ్మిన్‌అతిక్, జమతే సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణిని పరిశీలించిన ఎస్ఈ

ఆర్మూర్‌టౌన్, జూలై 8: పట్టణంలోని విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో ప్రజావాణిని విద్యుత్ సూపరిండెంట్ ఇంజనీర్ రవీంధర్ పరిశీలించారు. ప్రతీ సోమవారం ఏడీఈ కార్యాలయంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సమస్యల పరిష్కారం కొరకు విద్యుత్ ప్రజావాణి జరుగుతుందని వినియోగదారులు వినియోగించు కోవాలని అయన అన్నారు. అనంతరం ఫిర్యాదు దారులతో వారి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో ఏడీఈ శ్రీధర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో భారీ దొంగతనం

ఖిల్లా, జూలై 8: బావను దుబాయికి వెళ్లేందుకు విమానం ఎక్కించడానికి హైదరాబాద్ వెళ్లి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి 6వ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటోనగర్‌లో చోటు చేసుకుంది. 6వటౌన్ ఎస్‌ఐ మొగులయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... ఆటోనగర్‌కు చెందిన రఫీక్ తన బావను విమానం ఎక్కించడానికి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. సోమవారం తిరిగి వచ్చేవరకు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి లోనికి వెళ్లగా ఇంట్లో గల బీరువా సైతం తెరిచి ఉండడం, అందులోని సుమారు 20తులాల బంగారం, వెండి, నగదు అపహరించుకొని వెళ్లినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పదోన్నతి పొందిన ఎన్‌సీసీ అధికారికి సన్మానం

భిక్కనూరు, జూలై 8 : మండలంలోని పెద్దమల్లారెడ్డి ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అనీల్‌కుమార్ పదోన్నతి పొందడంతో పాఠశాల పూర్వవిద్యార్థులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, కుమ్మరి సంతోష్, నర్సింలు, గోపి, రమేష్ పాల్గొన్నారు.

అంతంపల్లి గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా అమృతారెడ్డి

భిక్కనూరు, జూలై 8: మండలంలోని అంతంపల్లి గ్రామాభివృద్ధి కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వలకొండ అమృతారెడ్డి, ఉపాధ్యక్షులుగా పిట్ల రాములు, కోశాధికారి బస్వా రవీందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గం సభ్యులు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి తమ పూర్తి సమయాన్ని కేటాయించి, అందరిని కలుపుకుని ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించండి'

సిరికొండ, జూన్ 8 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.అనిల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సిరికొండలో విద్యాశాఖ అధికారికి పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ విద్యార్థులకు కావల్సిన సదుపాయాలను కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని అనిల్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యవైఖరిని అవలంబిస్తున్నాయని ఆయన విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు నడిపిస్తున్న స్కూల్‌బస్సుల పిట్‌నెస్‌ను తరుచుగా తనిఖీలు చేయాలని అధికారులను కోరారు. హాస్టల్లో ఉండి చదువుకుంటున్న విద్యార్థుల సమస్యలు తక్షణమే పరిష్కారం చేయాలని పీడీఎస్‌యూ నాయకుడు అనిల్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ భీమ్‌గల్ ఏరియా కన్వీనర్ ఆశీష్, నాయకులు రాజేష్, రవీందర్, సాయిచంద్, సుశీల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రుద్రూరు, జూలై 8: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ అయేషా సిద్దిఖా, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం రుద్రూరు మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఉర్దూమీడియం, గాంధీ ప్రైమరీ స్కూల్‌లలో కీటక జనిత వ్యాధులు, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, దోమలు పుట్టకుండా వాటి జీవిత చక్రమును నిర్వీర్యం చేయడానికి ప్రతి శుక్రవారంను డ్రైడేగా పాటించడం వల్ల దోమలు వృద్ధి చెందవన్నారు. అదే విధంగా ఈగల ద్వారా వచ్చే వ్యాధులైన నీళ్ల విరేచనాలు, జిగట విరేచనాలు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలవిసర్జన తరువాత, ఆహారం తీసుకునే ముందు తప్పక చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణాధికారి రాజేందర్, సూపర్ వైజర్లు ఆర్.రవి, సుమతి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మహ్మద్ అసదుద్దీన్, రత్నకుమారి, జావేద్ అహ్మద్, సునంద, రాధ, మహ్మద్ అతార్, ఆరోగ్య కార్యకర్తలు గౌరి, ప్రేమలత రాణి, శిరీషా, ఆశలు, పుష్ప, నిర్మల పాల్గొన్నారు.

కోటగిరి: మండలంలోని ఎత్తొండ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా దోమల వృద్ధి లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడంతో పాటు తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రతి వారానికి ఒకసారి గోర్లు కత్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది హిమాంజలి, సరోజ, ప్రధానోపాధ్యాయురాలు ఉపాధ్యాయులు, అలివేలు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ధర్నా



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కారోబార్లు, జీపీ కార్మికులు

నవీపేట,జులై8: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం గ్రామ పంచాయతీ కారోబార్లు, పంచాయతీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సుమారు ఆరు మాసాల నుంచి వేతనాలు అందకపోవడంతో తమకు కుటుంబ పోషణ భారంగా మారిందని వారు వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని వారు పేర్కొన్నారు. ఇప్పటికైన వెంటనే పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎ ంపీడీవో నాగనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మిన్ను కుమార్, నరేష్, ప్రేమ్‌లాల్, ప్రకాష్, రంజిత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్‌లో గంజాయి పట్టివేత



నిందితునితో పోలీసులు

జక్రాన్‌పల్లి,జూలై8:మండ లంలోని మనోహ రాబాద్ గ్రామశివారులో సాయి బాబా ఆలయం వద్ద వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామానికి చెందిన జల్సా శేఖర్ వద్ద నుంచి గంజాయిని పట్టుకున్నట్టు ఎస్సై సీహెచ్. తిరుపతి తెలిపారు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మనోహరాబాద్ గ్రామశివారులోని సాయి బాబా ఆలయం వద్ద జల్సా శేఖర్ అనుమానాస్పదంగా కనిపించ డంతో అతని పట్టుకొని విచారించ గా ఒక కిలో 200గంజాయిని పట్టుకొని స్వా ధీనం చేసుకున్నట్టు తెలి పారు. నింది తుడు శేఖర్ నిజామా బాద్ ప్రాంతం నుంచి కిలో గంజాయి రూ.15వేల కొనుగోలు చేసి గ్రా మీణ ప్రాంతంలో తిరుగుతూ విక్రయిస్తాడని ఎస్సై తెలిపారు. పట్టుకొని స్వాధీనం చేసుకున్న ఒక కిలో 200గ్రాముల గంజాయి విలువ రూ. 60వేల వరకు ఉంటుంద న్నారు. నిందితుడి జల్సా శేఖర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ప్రతీ ఇంట్లో ఐదు మొక్కలు నాటి, సంరక్షించాలి

● ఎంపీడీవో రాజా శ్రీనివాస్



పోతంగల్ ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

కమ్మర్‌పల్లి,జూలై 8:రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు పరుస్తున్న వనమహోత్సవంలో భాగంగా ప్రతీ ఇంట ఐదు మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షిస్తూపర్యావరణాన్ని కాపాడాలని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని నాగాపూర్‌గ్రామపంచాయతీ కార్యాలయంలో వనమహోత్సకార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మహిళా సంఘాలకు మొక్కలను పంపిణిచేశారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి ఐదు మొక్కల చొప్పున పంపిణీ బాధ్యతలు గ్రామ మహిళా సమాఖ్య సభ్యులకు అప్పగించారు. అనంతరం గ్రామసమీపంలోని వరదకాలువ ప్రాంతంలో మొక్కలు నాటారు. మొక్కలను పశువులు మేయకుండా కంచెఏర్పాటు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో విద్యానంద్, పంచాయతీ కార్యదర్శి కే సంధ్య, ఐకేపీ సీసీనవీన్ కుమార్, వీవోఅనసూయ, ఫీల్డ్‌అసిస్టెంట్ రాజేశ్వర్, సీనియర్ మేట్ గంగాధర్,గ్రామసమాఖ్య అధ్యక్షురాలు బాలహంస, సంఘాల ప్రతినిధులు గ్రామస్తులు, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

కోటగిరి: పోతంగల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య కేంద్రం ఆవరణలోని ఖాళీ స్థలంలో వివిధ రకాల మొక్కలను నాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కరణ్, రాధిక, సిబ్బంది గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్:మండలంలోని రెంజర్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం వన మహోత్సవంలో భాగంగా పాఠ శాల ఆవరణలో పాఠ శాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్, విద్యా ర్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యా యుడు మాట్లాడుతూ ప్రతీఒక్కరు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సామ ప్రసాద్, మల్లేశ్, రవి, దేవసాయం, మోహన్, శ్రీనివాస్, మధార్, మురళీ, గోపి, గంగాధర్, అనుపమ, విద్యార్థులు పాల్గొన్నారు.

నవీపేటలో తాళం వేసిన ఇంట్లో దొంగతనం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది

● 4.10 లక్షల రూపాయల చోరీ
● క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సిబ్బందితో తనిఖీ

నవీపేట,జులై8: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన సయ్యద్ మీర్ ఇంట్లో 4.10లక్షల రూపాయల దొంగతనం జరిగింది. ఎస్‌ఐ యాదగిరి గౌడ్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం ఈ నెల 6న సయ్యద్ మీర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి నందిపేట వెళ్లారు. సోమవారం రోజున ఉదయం వారు తిరిగి ఇంటికి రాగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న 4.10లక్షల రూపాయల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. హౌసింగ్ లోన్ చెల్లించడానికి సంబంధిత డబ్బులను అప్పుగా తేవడం జరిగిందని, సోమవారం సంబంధిత డబ్బులను చెల్లిద్దామని ఇంట్లో ఉంచి నందిపేట వెళ్లగా తిరిగి వచ్చేసరికి ఈ దొంగతనం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దొంగతనం శనివారం రాత్రి గాని, ఆదివారం రాత్రి గాని జరిగి ఉంటుందని భావిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. బాధితుడు సయ్యద్ మీర్ మండల కేంద్రంలోని ఓ బీడీ కంపెనీలో ప్యాకర్‌గా పని చేస్తున్నాడు. ఇదిలా ఉండగా దొంగతనం జరిగిన ప్రదేశాన్ని క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పరిశీలించి ఆధారాలు సేకరించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దొంగలను త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

జీవనభృతి అమలు చేయాలని నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పెద్దబజార్, జూలై 8: బీడీ కార్మికులందరికి కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన దాని ప్రకారం 4వేల రూపాయల జీవనభృతిని అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి ధర్నా చౌక్ వరకు భారీ ర్యాలీ ప్రదర్శన చేపట్టి అక్కడ బహిరంగసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీడీ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని కార్మికులకు ఉపాధి కల్పించండి లేదా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవనభృతి ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గత సర్కార్ కేసీఆర్ ఆంక్షలు విధించి కార్మికులకు తీవ్ర ఇబ్బందులు కల్పించిందన్నారు. బీడీ పరిశ్రమను దెబ్బతీయడానికి నరేంద్రమోది ప్రభుత్వం రకరకాల చర్యలు చేపట్టి సిగరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తుందని ఆయన అన్నారు. మోది ఎన్నికల్లో ఉపాధి భద్రత స్వదేశి పరిశ్రమల పరిరక్షణ, ప్రతియేటా రెండు కోట్ల కొలువులు ఇస్తామని వాగ్దానం చేసి కార్మిక వ్యతిరేక విధానాలతో కార్పొరేట్ కంపెనీలకు సేవ చేసిందని ఆయన తెలిపారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను మోది ప్రభుత్వం తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లిలో నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడం సాధ్యం కాదని తీర్మానం చేయాలని ఆయన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పిఎఫ్, ఇఎస్‌ఐ చట్టాలను కార్మికులకు వర్తింపజేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు. మోది సర్కార్ ప్రభుత్వ రంగ సంస్థలను బహిరంగంగా వేలం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు భూమేశ్వర్, భూమన్న, సూర్య శివాజీ, గంగాధర్, శివకుమార్, పద్మ, సుప్రియ, పోశెట్టి, బాలయ్య, సూరిబాబు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలోనే బదిలీలు చేపట్టాలని మంత్రికి వినతి



మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నిజామాబాద్ అర్బన్, జూలై 8: సాధారణ బదిలీలలో భాగంగా నాయబ్ తహసీల్దార్లకు, సీనియర్ అసిస్టెంట్లకు జిల్లాస్థాయిలోనే బదిలీలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, తదితరులు మంత్రిని కలిసి విజ్ఞప్తి చేశారు. బదిలీలపై నిషేధం ఎత్తివేసినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. జీవో నంబర్ 80 ప్రకారం బదిలీలు కాబోతున్న నాయబ్ తహసీల్దార్లకు, సీనియర్ అసిస్టెంట్లకు జిల్లాస్థాయిలోనే బదిలీలు చేపట్టాలని ఇతర జిల్లాలకు బదిలీలు కోరుకుంటే ఆప్షన్స్ ఇచ్చి బదిలీలకు అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం రెవెన్యూ ముఖ్యకార్యదర్శి సీసీఎల్‌ఏ నవీన్ మిట్టల్‌ను కలిసి జిల్లా స్థాయిలోనే బదిలీలు చేపట్టాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. జిల్లా స్థాయిలోనే బదిలీలు చేపడుతామని జిల్లా మారాలంటే ఆప్షన్స్ ఇస్తామని దానికి సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలు జారీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

పెద్దబజార్, జూలై 8: లిఫ్ట్ ఇరిగేషన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఎల్లమ్మగుట్టలోగల ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా లిఫ్ట్ ఇరిగేషన్ కాంట్రాక్టు కార్మికులకు నెలనెల వేతనాలు చెల్లించకుండా మూడు, నాలుగు నెలల పాటు బకాయిలు పెడుతూ కార్మికులకు తీవ్రమైన మానసిక వేదనకు గురిచేస్తుందన్నారు. సకాలంలో నెలనెల వేతనాలు చెల్లించకపోవడం మూలంగా నిరంతరం పనిచేసిన కార్మికుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయని అన్నారు. బాధ్యత రహితమని ఇరిగేషన్ అధికారులు కూడా కార్మికుల వేతనాల చెల్లింపుపై పట్టించుకోకపోవడం నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడం సరైందికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు బిల్లులకు, వేతనాలకు పొంతన పెట్టడం సరికాదని అన్నారు. కార్మికులకు చెల్లించాల్సిన వేతన బకాయిలతో పాటు పిఎఫ్, ఈఎస్‌ఐతో పాటు కాంట్రాక్టర్‌తో జరిగిన ఒప్పందం ప్రభుత్వ కాలపరిమితి ముగిసినప్పటికి కొత్తగా టెండర్ పిలవకపోవడం మూలంగా కార్మికుల వేతనాలను పెరగడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ కార్మికుల నాయకులు గణేష్, మహిపాల్, కార్తిక్, బుచ్చన్న, సందీప్, అజయ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

● బీజేపీ నాయకుల వినతి

ఆర్మూర్‌రూరల్, జూలై8: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆలూర్ బీజేపీ మండల అధ్యక్షుడు కొత్తూరు గంగాధర్ డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ కిసాన్‌మోర్చ పిలుపు మేరకు సోమవారం ఆలూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ, రూ.15వేల రైతు భరోసా, రైతు కూలీలకు రూ.12వేల500, రైతులు పండించిన పంటలకు క్వింటాలుకు రూ.500బోనస్ వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు డాక్టర్ అరుణ్, సురేష్‌గౌడ్, హరీష్, మల్లయ్య, పాల్గొన్నారు.

పెర్కిట్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నామని బీజేపీ కిసాన్‌మోర్చ నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పేరుతో ఇచ్చిన హామీని నెరవేర్చక పోవడం దృష్టకరమన్నారు. మెనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కాకుండ సబ్ కమిటీలు అభిప్రాయ పేరుతో కాలయాపన చేస్తున్నారని అన్నారు. రూ.2లక్షల రుణమాఫీ పథకం ప్రభుత్వం ఏర్పడి 200రోజులు గడుస్తున్న ఇంక గందరగోళంగానే ఉందని అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్టోలో చెప్పిన విధంగా ఎలాంటి అంక్షాలు లేకుండా రూ.2లక్షల వ్యవసాయ రుణాన్ని బేషరతుగా మాఫీ చేయాలని, రైతు భరోసా పేరుతో సాగు చేస్తున్న ప్రతీ ఎకరాకు రైతు భరోసా కింద ఖరీఫ్, రబీ కలుపుకొని రూ.15వేల అందించాలని, కౌలు రైతులకు ఎన్నికల సమయంలో రూ.15వేల ఆర్థిక సహాయం అందించాలని, వ్యవసాయ కూలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ సంవత్సరానికి రూ.12వేల500 అమలు చేసి తెలంగాణలో ప్రధాన మంత్రి పంటల బీమా యోజనను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ నాయకులు నూతుల శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి, శేషగిరి లింగం, ద్యాగ ఉదయ్, యామాద్రిబాస్కర్, కలిగోట గంగాధర్, ఆకుల శీను, ఆకుల రాజు, పొల్కం వేణు, పులి యుగంధర్, మందుల బాలు, విజయానంద్, తదిర తులు పాల్గొన్నారు.

ముప్కాల్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న ముప్కాల్ బీజేపీ కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన ఇంత వరకు రైతు భరోసా హామీ నెరవేర్చ లేదని, రూ.2లక్షల వ్యవసాయ రుణమాఫీ అమలు 200రోజులైన ఇంక రైతులకు గందరగోళంలోనే ఉందని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలకు రూ.12వేల 500హామీ ఇచ్చిన వెం టనే అమలు చేయాలని, తెలంగాణ ప్రధాన మంత్రి పంట బీమా యోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని తహసీల్దార్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు ముస్కు నర్సయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్, విక్రం, కెఎం.రెడ్డి, నర్సయ్య, తెడ్డు గంగాధర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కమిటీలను వేస్తూ కాలయాపన చేస్తున్నదని బీజేపీ కిసాన్‌మోర్చ మండల అధ్యక్షుడు ధర్పల్లి బాబురావు ఆరోపించారు. కిసాన్ మోర్చ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రైతు రుణమాఫీ, రైతుభరోసా నిధులను వెంటనే విడుల చేయాలని కోరుతూ సిరికొండలో సోమవారం తహసీల్దార్ రవీందర్‌రావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండువందల రోజులు గడుస్తున్నప్పటికీ రైతులు తీసుకున్న పంటరుణాలు రెండు లక్షల రూపాయలను మాఫీ కాని కారణంగా బ్యాంకుల్లో రైతులు మొండిబకాయి దారులుగా మారి పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే రుణమాఫీని చేయాలని, రైతులు పంటలు సాగుచేస్తున్నందున పెట్టుబడి సహాయం కిందా రైతు భరోసా పథకంలో నిదులు రైతుల ఖాతాల్లో వేయాలని బాబారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు, వ్యవసాయ కూలీలకు అందిస్తామన్న ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపి,వి.అజయ్,కిషన్,మారుతి,కిరణ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆలూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



ముప్కాల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వర్షాలు కురవాలని ఆలయంలో పూజలు



ఆలయంలో వరదపాశంతో అభిషేకం చేస్తున్న నాయకపోడు సంఘ సభ్యులు

ఆర్మూర్‌రూరల్, జూలై8: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో నాయకపోడు సంఘం ఆధ్వర్యంలో సోమవారం వర్షాలు కురువాలని బీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాలు సమృద్ధిగా కురువాలని, పంటలు పండాలని ప్రార్థిస్తూ బీమన్న దేవునికి వరదపాశంతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మూడ అశోక్, గౌరవ అధ్యక్షుడు మూడ గంగాధర్, ప్రధానకార్యదర్శి బాస్కర్, ఉపాధ్యక్షుడు మేడరం ముత్తెన్న, చిన్న గంగారాం, నాయకపోడు సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

టీయూలో ఘనంగా తీజ్‌పండగను నిర్వహిస్తాం

డిచ్‌పల్లి,జులై 8: తెలంగాణ యూనివర్సిటీలో తీజ్ పండగ నిర్వహణపై గిరిజన శక్తి సంఘం వర్సిటీ అధ్యక్షుడు శ్రీనురాథోడ్, అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. బంజారాల సంస్కృతిని కాపాడాలనే ఉద్ధేశంతో వర్సిటీలో తీజ్‌పండగను నిర్వహిస్తున్నామని కావున ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంజయ్, సాగర్, చందర్, పాల్గొన్నారు.

బైక్ పైనుంచి పడి వ్యక్తికి గాయాలు

నవీపేట,జులై8: మండలంలోని అబ్బాపూర్(ఎం)కు చెందిన మద్దెపల్లి పోశెట్టి అనే వ్యక్తి బైక్‌పై నుండి పడడంతో అతనికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. గ్రామ శివారులో ఉన్న పెట్రోల్ బంకు నుండి అబ్బాపూర్(ఎం) వైపు వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కింద పడడంతో అతనికి గాయాలు కాగా వెంటనే అతనిని ఆసుపత్రికి తరలించడం జరిగిందని అన్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

'సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం'

ఏర్గట్ల, జులై 8: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు మెడికల్ ఆఫీసర్ ప్రసన్నప్రియ వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్‌వో సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెరువులో పడి మత్స్యకారుడి మృతి

మోపాల్, జూలై 8 : మోపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింగంపల్లి గ్రామానికి చెందిన పల్లికొండ నర్సయ్య (35) చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. నర్సయ్య వృత్తిరీత్యా చేపలు పట్టడానికి సోమవారం ఉదయం వెళ్లగా ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి సందర్శించి చెరువులో పడ్డ నర్సయ్యను బయటకు తీశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మబ్బ్యా పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

డిచ్‌పల్లిలో విద్యుత్ ప్రజావాణి

డిచ్‌పల్లి,జులై 8 : ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం డిచ్‌పల్లిలో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం డివిజనల్ ఇంజనీర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను డీఈ ఉత్తమ్ జాడే దృష్టికి తీసుకొచ్చారు. సిరికొండ మండలం కొండూరు గ్రామ ఎలుగట శివారులో 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎక్కువ మోటార్లు ఉండటంతో అధిక లోడు ఉత్పన్నమవుతుందని, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యలు వస్తున్నాయని, పరిష్కారం చూపాలని డీఈ ఉత్తమ్ జాడేకు రైతులు వినతిపత్రం అందజేశారు.

టీయూలో జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలు

డిచ్‌పల్లి, జూలై 8 : జూలై 9 ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం తెలంగాణ యూనివర్సిటీలో జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాగత తోరణం ఎదుట స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ మాట్లాడుతూ. ప్రపంచంలో అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, సెక్రటరి అమృత్‌చారి, నాయకులు నాగరాజు, పావని, అనిల్, బాంధవ్య, సమీర్, ప్రమోద్, హరికృష్ణ, నవీన్, అజయ్, మోహన్, సోమనాథ్, సచిన్, హరినాథ్ పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో అధికారుల తనిఖీలు

భిక్కనూరు, జూలై 8 : మండలంలోని అంతంపల్లి శివారులో ఉన్న సప్తగిరి రైస్‌మిల్లులో సివిల్ సప్లై స్పెషల్ టీం, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులు సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ఈ రైస్‌మిల్లుకు కేటాయించిన దాన్యం బస్తాలు రైస్‌మిల్లులో నిల్వ ఉన్నాయా, రికార్డుల్లో ఏమైనా వ్యత్యాసం ఉందా, తదితర అంశాలను అధికారుల బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారుల బృందం సభ్యులు మాట్లాడుతూ భిక్కనూరు మండలంతో పాటుగా పాల్వంచ మండలంలోని, సదాశినగర్ మండలంలోని పద్మావతి రైస్‌మిల్లులో ఈ తనిఖీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఈ రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యం బస్తాలు నిల్వ ఉన్నాయా లేదా అని తనిఖీ చేసి ప్రతిది రికార్డుల్లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. రికార్డులను ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని తెలిపారు. కాగా తనిఖీలు రాత్రి వరకు కొనసాగగా, ఇలాంటి తనిఖీలు జిల్లాలో మరిన్ని జరగనున్నట్లు సమాచారం. తనిఖీల్లో ప్రత్యేక అధికారుల బృందంతో పాటుగా తహసీల్దార్ శివప్రసాద్, సివిల్‌సప్లై డీటీ కిష్టయ్య, భిక్కనూరు ఎస్సై సాయికుమార్ పాల్గొన్నారు.

ఉపాధి పెండింగ్ బిల్లులు వచ్చేలా చూస్తాం

● డీఆర్‌డీవో జిల్లా అధికారి సాయాగౌడ్



చందూర్‌లో మాట్లాడుతున్న జిల్లా అధికారి

వర్ని,జులై8: ఉపాధి కూలీలకు రావాల్సిన పెండింగ్ బిల్లులు త్వరలో వారి బ్యాంకు ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీఆర్‌డీవో జిల్లా అధికారి సాయాగౌడ్ భరోసా ఇచ్చారు. చందూర్ మండల కేంద్రంలో సోమవారం జాతీయ ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మే 25వరకు ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లింపు జరిగిందని వివరించారు. మిగతా బిల్లులను త్వరలో చెల్లించే విధంగా ఉన్నతాధికారుల సహకారంతో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు వెల్లడించారు. ఉపాధి క్షేత్ర సహాయకులు పని కోరే వారి దరఖాస్తులు తీసుకోవాలని, నర్సరీల్లో ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటాలని సూచించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన పనిలో కొలతలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని అలాంటి పొరపాట్లు జరిగితే ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. అనంతరం ఐకేపీ కేంద్రంలో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో తారాచంద్, ఏపీవో సురేష్, ఎస్‌టీఎం అమ్జద్ అలీ, ఏపీవో నారాయణ, రాష్ట్ర అబ్జర్వర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిద్ధులగుట్టపై ఘనంగా పల్లకీసేవ


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పెర్కిట్, జులై8::ఆర్మూర్ పట్టణంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నవనాథ సిదులగుట్టపై సోమవారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి రామాలయం, దుర్గామాత, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మ తల్లి, ఏకశీల స్తంభం వద్ద గల హనుమాన్ ఆలయంలోప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల జిల్లాల నుంచి విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నిరకాలసౌకర్యాలు కల్పించారు.నందీశ్వర మహ రాజ్ ఆధ్వర్యంలో వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు.ప్రతీసంవత్సరం ఆషాడ మాసం రెండో సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శివాలయం అంతట శివలింగానికి గాజులతో అలంకరించి అలంకరించిన గాజులను మహిళ భక్తుల చే సామూహిక కుంకుమార్చన నిర్వహించి వారికి అందజేస్తారు. కావున సోమవారం మహిళ భక్తులు ఉదయం విచ్చేసి పూజ కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సుమన్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, అజరి సతీష్, బోండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్,చరణ్‌రెడ్డి, కొంతం మురళీ, బట్టు శంకర్, సిద్ధులగుట్ట సేవ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

28న ఊర పండుగ

పెద్దబజార్, జూలై 8:ఆషాఢమాసంలో ఆనవాయితీగా జరుపుకునే పండుగ సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి బోనాల పండుగ రోజున జరుపుకునే రోజు జరిగే ఊరపండుగ నాడు గురుపౌర్ణమి రావడం వల్ల ఈనెల 28న ఊరపండుగ జరుపుకోవాలని సర్వసమాజ్ కమిటి జిల్లా అధ్యక్షుడు, అర్బన్ మాజి ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ తెలిపారు. నగర ప్రజలందరూ పెద్ద ఎత్తున జరిగే ఊరపండుగలో పాల్గొని అమ్మవార్ల ఆశీర్వాదం పొందాలని ఆయన కోరారు.

విద్యాశాఖలో బోధనేతర సిబ్బంది సీనియారిటీ జాబితా ప్రదర్శన

నిజామాబాద్ అర్బన్, జూలై 8: జిల్లా విద్యాశాఖ అధికారి పరిధిలో పనిచేసే బోధనేతర సిబ్బంది ఉద్యోగుల సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ప్రదర్శించడం జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వి దుర్గాప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై నిషేదం ఎత్తివేసిన దృష్ట్యా విద్యాశాఖ అధికారి పరిధిలో ఉన్న జూనియర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినెంట్‌ల సీనియారిటీ జాబితాను, క్యాడర్ వైస్ ఖాళీల జాబితాను, మోడల్ ఆప్షన్ ఫామ్‌ను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు ఆయన తెలిపారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 9న సాయంత్రం 5గంటలలోపు సంబంధిత పత్రాలతో జిల్లా విద్యాశాఖ అధికారి కా ర్యాలయంలో అందజేయాలని వారి ఆప్షన్ ఫామ్ సంబంధిత హెచ్‌ఎం ద్వారా ధ్రువీకరించి ఈనెల9 నుంచి 12లోగా అందజేయాలన్నారు. బదిలీల జీవో నంబర్ 80 ప్రకారం ప్రిఫరెన్షియల్ కేటగిరిస్,స్పౌస్, వికలాంగులు 70శాతం పైన, వితంతు, మెంటల్ రిటైర్డ్ (పిల్లలు),క్యాన్సర్ న్యూరోసర్జరి, కిడ్నీట్రాన్స్‌ప్లాంటేషన్, లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఓపెన్‌హార్ట్ సర్జరి, బోన్‌టిబి మొదలైన వ్యాధులు గల వారు సంబంధిత నిజామాబాద్ జిల్లా మెడికల్ బోర్డు ధ్రువీకరించిన పత్రంలేదా సదరంసర్టిఫికెట్ తీసుకొని ఈనెల 10న సాయంత్రం 5గంటలలోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని లేనిచో వారి బదిలీ దరఖాస్తును సాధారణ బదిలీ దరఖాస్తుగా పరిశీలించడం జరుగుతుందన్నారు.ఈసందర్భంగా వెబ్‌సైట్‌లో 36మంది జూనియర్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను ఉంచారు.

కమలాపూర్‌లో దొంగతనం

నవీపేట,జులై8: మండలంలోని కమలాపూర్‌కు చెందిన గుండ్ల నారాయణ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. ఎస్‌ఐ యాదగిరి గౌడ్, స్థానికులు తెలిపిన ప్రకారం నారాయణ భార్య వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. నిద్ర చేయడానికి నారాయణ అదే గ్రామంలో ఉన్న తన సోదరుడు ఇంటికి ఆదివారం సాయంత్రం వెళ్లాడు. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాన్ని పగులగొట్టి ఇంట్లో ఉన్న 12వేల రూపాయల నగదు, 6తులాల వెండితో పాటు చేపలు పట్టడానికి ఉపయోగించే వలలను సైతం ఎత్తుకెళ్లారని స్థానికులు పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ


ప్రజావాణి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు


కలెక్టరేట్‌కు వచ్చిన వీఆర్ఏల వారసులు

నిజామాబాద్ అర్బన్, జూలై 8: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 105 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, డిపివో తరుణ్‌కుమార్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు సమీక్షలు జరుపుతూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

గత ప్రభుత్వం విడుదల చేసిన జీవోఎంఎస్ 81, 85 ప్రకారం 3797 మంది 61 ఏళ్ల పైబడిన విఆర్ఏల వారసులకు ఉద్యోగ నియామకాల కోసం జీవోలు ఇచ్చారని కావున వెంటనే వారికి ఉద్యోగాలు ఇవ్వాలని విఆర్ఏల వారసులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన జీవోలపై స్టే ఉన్న కారణంగా నియామక ఉత్తర్వులు ఇవ్వలేదని కాని హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే ఎత్తివేసిందని కావున వెంటనే నియామక ఉత్తర్వులు ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుధీర్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

● టర్మినేట్ ఉత్తర్వులు నిలిపివేయాలి

కెజిబివి నాన్ టీచింగ్, వర్కర్లు కొంతమందిని టర్మినేట్ చేస్తూ డిఇవో ఇచ్చిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల కెజిబివి నాన్‌టీచింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 61 ఏళ్లు నిండిన వారిని తొలగించాలని సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారని కావున ఆ ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, రమ, లక్ష్మి, రుక్మ, సాయమ్మ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

● పుస్తకాల బరువును తగ్గించాలని వినతి

ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులపై పడుతున్న అధిక పుస్తకాల బరువును తగ్గించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో జీవో నంబర్ 22ను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్,జూలై8: వాతావరణ మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున్న సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాధీ హనుమాంతు అధికారులకును ఆదేశించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణ కోసం సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం సమావేశం మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో పరిసరాలు పరిశుభ్రతను పాటిస్తూ నీటి నిల్వలను తొలగించి పైప్‌లైన్ లీకేజీలను మరమ్మతులు తాగు నీటిని వనరులను క్లోరినేషన్ చేయించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ మిగతా అన్ని శాఖలతో సమన్వయం ఏర్పరచాలని, ముఖ్యంగా పంచాయతీరాజ్, రూరల్ వాటర్ సప్లై, మున్సిపల్, పబ్లిక్ రిలేషన్ లాంటి శాఖలతో కోఆర్డినేషన్ కలిగి జిల్లాలో సీజనల్‌వ్యాధ్యులు ముఖ్యంగా మలేరియా, డెంగీ,చికెన్‌గున్యా లాంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో గ్రామస్థులకు, విద్యాలయాల్లో విద్యార్థులకు, వ్యాధుల గురించి అవగాహన కల్పించాలన్నారు. వ్యాధి బారిన పడిన వారికి ఎలాంటి చికిత్స విధానం గురించి అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ మకరందు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ తుకారం రాథోడ్, డీఐవో డాక్టర్ అశోక్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీఈవో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి


బోధన్‌లో వైఎస్సార్ జయంతి వేడుకల దృశ్యం


నందిపేటలో ..


వేల్పూర్‌లో..

బోధన్‌రూరల్,జులై8: బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల బీఎస్ఆర్ గార్డెన్‌లో సోమవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ రైతు పక్షపాతి అని ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత ఆయనదేనన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ అభిమానులు శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కొండారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, హేమ సుందర్, బ్రహ్మారెడ్డి, ధనుంజయ్ రెడ్డి, వెంకట్రామి రెడ్డిలు పాల్గొన్నారు.

వర్ని: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీను, మారుతీ, బ్రహ్మాజీ, విజయ భాస్కర్ ఉన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆలూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం దివంగత మాజీసీఎం వైఎస్.రాజశేఖర్ 75 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీచైర్మన్ యాల్లసాయిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, కాంగ్రెస్‌నాయకులు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుత్ప ఎత్తిపోతల పథకంతో ఆర్మూర్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన గొప్ప నాయకుడు వైఎస్ఆర్ అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, 108, ఉచిత విద్యుత్, విద్యార్థులకు రియంబర్స్‌మెంట్ పథకా లతో పాటు సంక్షేమ అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పస్క నర్సయ్య, వైఎస్.మల్లారెడ్డి, నవనీత్, సంజీవ్, బాస్కర్, అనిల్, నారాయణ, కల్లెం చాంటి, తదితరులు పాల్గొన్నారు.

నంది పేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్ పూలమాల వేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ఆర్ జలయజ్ఞంలో భాగంగా మండలంలో గుత్ప ఎత్తిపోతల పథకం నిర్మించారని గుర్తుచేశారు. రుణమాఫీ కింద రైతులకు ఏకకాలంలో రు.లక్షమాఫీచేశారని, పేదలకు ఇందిరమ్మ పథకం పేరిట ఇళ్ల నిర్మాణం చేపట్టారని, అర్హులైన ప్రతీ ఒక్కరికి రు.2వందలు చొప్పున పింఛన్లు ఇచ్చారని వెల్లడించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భైండ్లప్రశాంత్, నాయకులు ఎడ్డిగారినిఖీల్,తొండాకూర్ గంగాధర్, తుక్కన్న, సయ్యద్ ఖదీర్, దేవిదాస్, యూసుఫ్, గంగాధర్, మాన్నూర్ భూమేష్, దమ్మాయి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని పీవీఆర్ భవన్ లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు మాజీసీఎం వైఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ మున్న, కౌన్సిలర్ లిక్కి శంకర్, కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, కొంతం మురళీధర్, సుంకె శ్రీనివాస్, కొక్కెర భూమన్న, బట్టు శంకర్, ఫయ్యాం, జిమ్మిరవి, నారాయణ, అతిక్, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్:మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో దివంగత మాజీసీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 75జయంతిని వేడుకలను సోమవారం కాంగ్రెస్ నాయకుల ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన వివిధ పథకాలు ఆరోగ్యశ్రీ, 108, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో పాటు సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ఆర్ దేనని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజేందర్, నరేందర్, రమణ, గంగయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్:మాజీసీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈవిగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం ఆరోగ్యశ్రీ ప్రవేశఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయ కులు గుండోజి రవి, సామ నరేష్, కొప్పెల రమేష్, చిన్న గంగయ్య, వరిగడ్డి రవి, పటేల్ నవీన్, రవినాయక్, కండెల చిన్న ముత్యం, సామ దిపి, అనిల్, మహేష్, జీవన్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

● రెంజర్ల గ్రామంలో

ముప్కాల్:మండలంలోని రెంజర్ల గ్రామంలో సోమవారం దివంగత మాజీసీఎం వైఎస్.రాజశేఖర్ 75వ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వైఎస్ఆర్ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసినివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సంస్కరణాలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి,జిల్లాఉపాధ్యక్షుడు గడ్డంచిన్నారెడ్డి, నాయకులు పెద్దరాజన్న, ఆకుల, ప్రదీప్, సుశాంత్, శేషాద్రి, సంజీవ్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు: దివంగత నేత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతిని రుద్రూరు మండల కేంద్రంలో సోమవారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చం ద్రశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి గొప్ప పథకాలను మహానేత వైఎస్ఆర్ ప్రవేశపెట్టారన్నారు. ఈకార్యక్రమంలో రుద్రూరుమండల కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటగిరి: మండల కేంద్రంలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్సార్ ప్రవేశపెట్టిన పథకాలు మరిచిపోలేనివని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వహీద్ హుస్సేన్, అయుబ్, జుబేర్ ఖాన్,తదితరులు పాల్గొన్నారు.

మోస్రా: మండల కేంద్రంలో బాన్సువాడ, నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాష్ట్ర విభజనకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా పేరుగాంచి రైతు పక్షపాతి అని భౌతికంగా మాకు దూరమైన మీరు చేసిన మేలును మేము ఎప్పటికి మిమ్ములను మరువము అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీ సెల్ అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్ గౌడ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాయిలు, అశోక్, సైనాపురం నర్సారెడ్డి, బిల్లారాజశేఖర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

పెద్దబజార్, జూలై 8: పెండింగ్‌లో ఉన్న నాలుగు డిఏలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు అన్నారు. సోమవారం నగరంలోని పెన్షనర్ల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 15న పెన్షనర్ల జెఎసి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నగదు రహిత వైద్యాన్ని అన్ని కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రుల్లో అనుమతించాలని డిమాండ్ చేశారు. 30 శాతం ఫిట్‌మెంట్‌తో పే డివిజన్ కమీషన్‌ను విడుదల చేయాలన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని కార్యవర్గం తీర్మానించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మధుసూదన్, జిల్లా నాయకులు నారాయణ, వీరయ్య, గంగాధర్, బన్సిలాల్, రాజేందర్, బాలకృష్ణ, పురుషోత్తం, కృష్ణారావు, లింగయ్య, బాబాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

ఆర్మూర్‌రూరల్, జూలై8: మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మామిడిపల్లి గ్రామ శివారులో రైల్వేస్టేషన్ సమీపంలో పేకాట స్థావరంపై సోమవారం దాడి చేసి ఐదుగురు పేకాట రాయుళ్ళను పట్టుకున్నారు. జిల్లా సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ పురుషోత్తం, పోలీస్ సిబ్బంది ఐదుగురు పేకాట రాయుళ్ళను పట్టుకొని వారివద్ద నుంచి రూ.14వేల 110నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.265	రూ. 285


బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73100	రూ.67,400	రూ.940

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : కల్కి (3డి తెలుగు) (11.00, 2.45, 6.30, 10.15)
స్క్రీన్-2 : డిస్పికేబుల్ మి-4 (తెలుగు 3డి) (11.40, 2.00, 4.20, 6.40)
: డిస్పికేబుల్ మి-4 (ఇంగ్లీష్ 3డి) (9.00)
స్క్రీన్-3 : ఎంఎస్ ధోని (హిందీ) (11.30, 3.15, 7.00, 10.45)
స్క్రీన్-4 : కిల్ (హిందీ) (12.30, 3.00, 5.30, 8.00, 10.30)



ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కల్కి (తెలుగు) (1.30, 6.50, 10.30)
స్క్రీన్-2 : కల్కి (తెలుగు) (10.45, 3.45)
: కల్కి (3డి తెలుగు) (7.10, 10.35)

దేవి : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : కల్కి (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కల్కి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్